## క్లుప్తంగా

### యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

చిన్నశంకరంపేట(మెదక్): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళిత యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని మాల పరిరక్షణ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మల మైసయ్య కోరారు. బుధవారం నార్సింగి మండల కేంద్రంలో నార్సింగి మండలాధ్యక్షుడు మల్లేశం, చేగుంట మండలాధ్యక్షుడు ఎల్లంతో కలిసి మాట్లాడారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందించాలని కోరారు. యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పర్చేందుకు ఎస్సీ కార్పొరేషన్ రుణాలు అందించడం నిరంతర ప్రక్రియగా కొనసాగాలని కోరారు.

### వైభవంగా బోనాల ఊరేగింపు


బోనాల ఊరేగింపులో భక్తులు

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని చీలాపల్లి గ్రామంలో దుర్గమ్మ ఉత్సవాలు బుధవారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు మహిళలు గ్రామ పురవీధుల గుండా బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నాలుగు రోజుల పాటు అమ్మవారి జాతర నిర్వహించనున్నారు.

### కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన దొంతి వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి, సమేత వేణుగోపాలస్వామి నరసింహావతారంలో దర్శనమించారు. పల్లకీసేవ గ్రామంలోని ప్రధాన వీధుల్లో నిర్వహించారు.

### వైద్య సేవలు అందించడం అభినందనీయం


వృద్ధులకు అందిస్తున్న మందులు

నర్సాపూర్: వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఉచితంగా వైద్య సేవలందించడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అన్నారు. బుధవారం నర్సాపూర్‌లోని విజన్ ఓల్డ్ ఏజ్ హోంలో మల్లారెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకురాలు అపర్ణ, హాస్పిటల్ వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

### ఘనంగా మల్లికార్జునస్వామి జాతర


ఎడ్ల బండ్ల ఊరేగింపులో భక్తులు

అల్లాదుర్గం(మెదక్): మండలంలోని గడి పెద్దాపూర్ గ్రామంలో మల్లికార్జున స్వామి జాతరను మూడు రోజులుగా ఘనంగా జరుపుకుంటున్నారు. ఇందులో భాగంగా బుధవారం భక్తులు ఎడ్ల బండ్లను రంగురంగులు అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగింపుగా వెళ్లి మల్లికార్జున స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు. భక్తులతో పాటు చుట్టుపక్క గ్రామాలైన ముస్లాపూర్, బిజిలిపూర్ తదితర గ్రామాలకు చెందిన భక్తులు ఎడ్లబండను కట్టి ప్రదక్షిణలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

### వారణాసిలో ప్రచారం

మెదక్‌జోన్: ప్రధాని నరేంద్ర మోదీ పోటీ చేస్తున్న వారణాసిలో బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, బండి సంజయ్, పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డితో కలిసి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం చేసిన అభివద్ధిని వివరిస్తూ ప్రచార పత్రాలు పంపిణీ చేశారు. నరేంద్రమోదీకి మద్దతుగా వారు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కమలం పువ్వుకు ఓటేసి నరేంద్ర మోదీని గెలిపించాలని కోరారు. నాయకులు గజానంద్, జ్యోషి, మహేష్, కరణం పరణీత, తదితరులు ఉన్నారు.

# అభివృద్ధికి నోచుకోని పేట

రామాయంపేట పట్టణం మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. అయినా.. సమస్యలు మాత్రం అలాగే ఉన్నాయి. గతంలో మంజూరైన అభివృద్ధి పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో వాటిని పూర్తి చేయించే విషయమై ఎవరూ పట్టించుకోకపోవడంతో ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదు.

– రామాయంపేట(మెదక్)

- అసంపూర్తి పనులను పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఇబ్బందుల్లో పట్టణవాసులు


పిల్లర్ల స్థాయిలో నిలిచిన వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం పనులు

ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం పాలనా వికేంద్రీకరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే 2018లో రామాయంపేట పట్టణం మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. తద్వారా తమ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని సంబరపడ్డ పట్టణవాసులకు నిరాశే ఎదురైంది. రామాయంపేట మేజర్ పంచాయతీగా ఉన్న సమయంలోనే జరిగిన అభివృద్ధి తప్పించి మున్సిపాలిటీ అయిన తర్వాత ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. తహసీల్దార్ కార్యాలయం పూర్తిగా శిథిలమవడంతో దాని స్థానంలో మరో కొత్త భవన నిర్మాణానికి ఐదేళ్ల క్రితం రూ. 3.5 కోట్లు మంజూరయ్యాయి. సంబంధిత కంట్రాక్టర్ భవనం స్లాప్ వేయించిన తర్వాత పనులు మధ్యలోనే వదిలి వెళ్లిపోవడంతో సదరు భవనం నిర్మాణం పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ప్రస్తుతం కార్యాలయం కొనసాగుతున్న పాతభవనం పూర్తిగా శిథిలమై ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితుల్లో అధికారులతో పాటు కార్యాలయానికి వెళ్తున్న రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రామాయంపేటలో మినీ స్టేడియం నిర్మాణానికి ఏడేళ్లక్రితం రూ. 2.65 కోట్లు మంజూరు కాగా జాతీయ రహదారి పక్కనే 1421 సర్వేనంబర్‌లో స్థలం ఎంపిక చేశారు. సంబంధిత కంట్రాక్టర్ సదరు స్థలాన్ని చదును చేసి రూ. 20 లక్షలు డ్రా చేసుకొని వెళ్లిపోయాడు. దీనితో స్టేడియం నిర్మాణ పనులు నిలిచిపోయాయి. రామాయంపేటలో మూడేళ్లక్రితం వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణానికి రూ. మూడు కోట్లు మంజూరు కాగా ఎంపీపీ కార్యాలయం ఆవరణలో పనులు ప్రారంభించి పిల్లర్లస్థాయిలో ఆపేశారు. 15 ఏళ్ల క్రితం బస్‌డిపో మంజూరు కాగా స్థలాన్ని స్వాధీనపర్చుకొని సంస్థ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్న ఆశాఖ అధికారులు తర్వాత పట్టించుకోలేదు. దీనితో సదరు స్థలం ఆక్రమణలకు గురవుతోంది. రామాయంపేటకు 2018లో మినీట్యాంక్‌బండ్ నిర్మాణానికి రూ. 3.20 కోట్లు మంజూరయ్యాయి. దీనితో కట్ట వెడల్పు చేయించిన అధికారులు కల్వర్టు నిర్మించి వదిలేశారు. ముఖ్యంగా పట్టణంలోని మురుగు నీటిని చెరువులోకి వదిలేస్తుండటంతో నీరంతా కలుషితమై రంగు మారింది. చెరువులోని నీటిని శుద్ధీకరణ చేయకపోవడంతో ఈ ప్రాంత ప్రజలకు దుర్వాసన వెదజల్లుతోంది. రోడ్డును ఆనుకునే ఉన్న చెరువులోకి తరచూ వాహనాలు దూసుకెళ్తున్నాయి.


కలుషితంతో రంగు మారిన మల్లెచెరువు నీరు


శిథిలమైన తహసీల్దార్ కార్యాలయం

చెరువు కట్టపై కంకర పర్చుకొని కట్టపై వెళ్లడానికి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

## ఫీల్డ్ అసిస్టెంట్ల పనితీరు భేష్

**ఎంపీడీఓ శ్రీనివాస్**

కౌడిపల్లి(నర్సాపూర్): ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ల పనితీరు అభినందనీయమని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లను ఎంపీడీఓ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కువ మంది కూలీలకు పనులు కల్పించడంతో కౌడిపల్లి మండలంలోని రెండో స్థానంలో ఉండగా గిట్టుబాటు కూలీడబ్బులు కల్పించడంలో మొదటి స్థానంలో ఉందని దీనికి ఫీల్డ్ అసిస్టెంట్లను అభినందించారు. గ్రామాల్లో కూలీ పని అడిగినా ప్రతి కూలీకి పనులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఫీల్డ్ అసిస్టెంట్లు మరింత కృషి చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా ఎక్కువ మంది కూలీలకు పనులు కల్పించిన ఫీల్డ్ అసిస్టెంట్లు గంగారం గౌడ్ (రాజిపేట), వీరేశం (భుజిరంపేట), శేక్‌అలి (కూకుట్లపల్లి), కరుణాకర్ (కంచన్‌పల్లి), సుధాకర్ (మహ్మద్‌నగర్), శంకర్ (తిమ్మాపూర్), టీఏ ప్రసాద్‌లను ఎంపీడీఓ శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీఓ వెంకటేశం, ఏపీఓ పుణ్యదాస్, ఈసీ ప్రేంకుమార్ సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**ఎస్‌ఐ నారాయణగౌడ్**


మాట్లాడుతున్న ఎస్‌ఐ నారాయణగౌడ్

చిన్నశంకరంపేట(మెదక్): ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని చిన్నశంకరంపేట ఎస్‌ఐ నారాయణగౌడ్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి చిన్నశంకరంపేట మండలంలోని ఎస్.కొండాపూర్ ప్యాటగడ్డతండాలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో ప్రజలను చైతన్యపరిచారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు సెల్‌ఫోన్ వినియోగిస్తుండడంతో సైబర్ నేరగాళ్లు అమాయకులకు ఎరవేస్తూ ఓటీపీ తీసుకొని ఖాతాలోని డబ్బులు కాజేస్తున్న సంఘటనలు పెరుగుతున్నాయన్నారు. ఎవరు కూడా తెలియని వ్యక్తులకు ఓటీపీ చెప్పవద్దన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరించినా, అనుమాన స్పద వ్యక్తులు కన్పించిన పోలీస్‌లకు సమాచారం అందించాలని కోరారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా.. చట్టపరిధిలో పరిష్కారం కోసం తమను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

## వరి ధాన్యానికి బోనస్ చెల్లించాలి


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): గత ఎన్నికల్లో వండ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు క్వింటాలు వరి ధాన్యానికి రూ.500 మద్దతు వెంటనే చెల్లించాలని బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. బుధవారం బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వరిపంటకు బోనస్ ఇస్తామని చెప్పి రైతులను మోసం చేసిందన్నారు. ప్రభుత్వం కేవలం సన్నరకానికి మాత్రమే బోనస్ చెల్లిస్తామని, దొడ్డు రకానికి చెల్లించక పోవడం మోసపూరితమన్నారు. ప్రభుత్వం రైతుల పండించిన ధాన్యానికి గిట్టుబాటుధరతో పాటు ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శ్రావణ్, మాజీ సర్పంచ్‌లు సుధాకర్, అశోక్, నాయకులు శ్రీశైలం, వెంకటయ్య, దేవయ్య, కృష్ణ తదితరులు ఉన్నారు.

## సర్పంచ్, ఎంపీటీసీ స్థానాన్ని ఎస్సీలకు కేటాయించండి

కొల్చారం(నర్సాపూర్): మండలంలో ఎనగండ్ల గ్రామపంచాయతీ సర్పంచ్, ఎంపీటీసీ స్థానాన్ని ఎస్సీలకు కేటాయించాలని గ్రామ దళిత యువ రత్న అవార్డు గ్రహీత బాబయ్య బుధవారం ఓ ప్రకటనలో కోరారు. గ్రామ పంచాయతీ వ్యవస్థ ఏర్పాటైన నాటి నుంచి సర్పంచ్, ఎంపీటీసీ పదవులు ఎస్సీలను వరించకపోవడం బాధాకరమైన విషమన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో రెండు స్థానాలను ఎస్సీలకు కేటాయించాలంటూ నర్సాపూర్ ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

### గ్యారంటీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

చినన్నంకరంపేట(మెదక్): గ్యారంటీలతో ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని బీఆర్ఎస్ యువజన విభాగం మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు విమర్శించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి పంటకు రూ.500 బోనస్ అని కాంగ్రెస్ గ్యారంటీ కార్డుతో ప్రజలు ఓట్లు అడిగిందని, ఇప్పుడేమో సన్నాలకు బోనస్ అంటు బోగస్ మాటలు మాట్లాడుతుందన్నారు. రైతులు కాంగ్రెస్ ప్రభుత్వం బోనస్ ఇస్తుందని గంపేడాశతో ఉన్నారని, వారిని మోసం చేయ్యోద్దన్నారు. ఇందులో సన్న రకం వడ్లు పండించే రైతులు చాలా తక్కువన్నారు. సన్నకారు రైతులు అసలు సన్న వడ్లు పండించరని అన్నారు.

### విత్తనాల కోసం రైతుల పాట్లు

నర్సాపూర్: జీలుగ విత్తనాల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. విత్తనాల కోసం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు రోజు స్థానిక మండల వ్యవసాయ శాఖ కార్యాలయానికి వచ్చి వెళ్తున్నారు. అధికారుల వద్ద విత్తనాలు స్టాకు లేనందున విత్తనాలు ఉన్నాయా లేవా అని రైతులు అడిగి తెలుసుకొని వట్టి చేతులతో ఇంటి ముఖం పడుతున్నారు. నాలుగు రోజులుగా విత్తనాల కోసం వచ్చి వెళ్తున్నామని, విత్తనాలు ఎప్పుడు వస్తాయో తెలియడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఏడీఏ సంధ్యారాణిని వివరణ కోరగా.. గతంలో వంద క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయని వాటిని పంపిణీ చేశామని చెప్పారు. రైతుల నుంచి డిమాండ్ రావడంతో విత్తనాలు కావాలని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయామన్నారు.

### సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీ

రామాయంపేట(మెదక్): పేటలో సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీని బుధవారం ఆ శాఖ అధికారులు ప్రారంభించారు. రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం ప్రతిని కార్యాలయంలో అందజేసి ఆన్‌లైన్ పర్మిట్ పొందారు. అనంతరం ఆగ్రో సేవా కేంద్రం లేదా ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో డబ్బులు చెల్లించి విత్తనాలు తీసుకెళ్లారు. 30 కిలోల జీలుగ విత్తనాల బస్తా ధర రూ. 1116 ఉంటుందని, ఈ విత్త నాలు 2.5 ఎకరాలకు సరిపోతాయని మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ తెలిపారు.

## మండలానికి 75బస్తాల జనుము విత్తనాలు

సాక్షి ఎఫెక్ట్

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి ఆగ్రోస్ రైతుసేవా కేంద్రానికి 75బస్తాల జనుము విత్తనాలు వచ్చినట్లు ఏఓ స్వప్న, ఏఈఓ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. బుధవారం 'సాక్షి' దినపత్రికలో జీలుగు విత్తనాల కోసం ఎదురుచూపు అన్న శీర్షికతో వార్త ప్రచురించితమైంది. దీంతో అధికారులు స్పందించారు. మండలానికి 75బస్తాల పెద్ద జనుము విత్తనాలు తెప్పించినట్లు చెప్పారు. ఇటీవల జీలుగు విత్తనాలు రాగా ప్రస్తుతం జనుము విత్తనాలు వచ్చాయన్నారు. 40కిలోల బస్తా రూ. 3,620 కాగా ప్రభుత్వం సబ్సిడీపై రూ. 1,448 పంపిణీ చేస్తుందన్నారు. భూసారాన్ని పెంచుకునేందుకు ఆసక్తి ఉన్న రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో ఆగ్రోస్ రైతుసేవా కేంద్రంలో సంప్రదించాలని అన్నారు.


కౌడిపల్లిలోని ఆగ్రోస్ రైతుసేవా కేంద్రం వద్ద జనుము విత్తనాల లోడ్ దింపుతున్న సిబ్బంది

## కనులపండువగా నరసింహుడి కల్యాణం

**భారీగా తరలివచ్చిన భక్తజన సందోహం**

తూప్రాన్: పట్టణంలోని రామాలయం సమీపంలోని శ్రీకూర్మ నరసింహస్వామి ఆలయ 41వ వార్షిక మహోత్సవం, స్వామి వారి కల్యాణ మహోత్సవం వేడుకలు వైభవంగా వేద పండితుల సమక్షంలో బుధవారం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మామిండ్ల జ్యోతికృష్ణ, ఆలయ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, విద్యాసాగర్, ఆలయ భక్త బృందం వారి ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన వార్షికోత్సవాలు బుధవారంతో ముగిశాయి. స్వామివారికి అభిషేకం, సుదర్శన హోమం, స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకులు అహోబిలం ప్రవీణ్, వెంకటేశ్వర్లు వేదమంత్రాలతో శాస్త్రోయుక్తంగా కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాన్ని మత్స్యశాఖ డైరెక్టర్ గడప దేవేందర్ చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ జ్యోతి కృష్ణ, కౌన్సిలర్లు నారాయణ గుప్తా, పల్లెర్ల రవీందర్ గుప్తా, జిన్న భగవాన్‌రెడ్డి, రాజు, నర్సోజి, యాదవ సంఘం అధ్యక్షులు తుమ్మెట శ్రీనివాస్ యాదవ్, నాగులు, శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

## అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

నిజాంపేట(మెదక్): రైతులు పచ్చిరొట్ట ఎరువులు సాగు చేసుకుంటే నేల భౌతిక స్థితి మెరుగుపడి గుల్లగా మారుతుందని నిజాంపేట మండల ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద పచ్చిరొట్ట ఎరువుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు పచ్చిరొట్ట ఎరువులు 60% సబ్సిడీపై అగ్రోస్ రైతు సేవా కేంద్రం, తిరుమల ఫర్టిలైజర్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పచ్చిరొట్ట ఎరువులు వేసుకోవడం వల్ల నేల భౌతిక స్థితి మెరుగుపడి, భూమి గుల్లగా మారి నేలలోకి నీరు ఇంకే గుణం పెరుగుతుందన్నారు. భూమిలో సేంద్రీయ పదార్థం పెరగడం వల్ల సూక్ష్మ జీవులు వృద్ధి చెంది, జీవ రసాయనిక చర్యలతో భూసారం పెరగడమే కాక, నేల సంపూర్ణ ఆరోగ్యాన్ని సంతరించుకొని ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచుకుంటుందన్నారు. భూమిలో రసాయన ఎరువులు వేసినప్పుడు వాటి లభ్యత పెరగడానికి హరిత ఎరువులు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణతో పాటు వ్యవసాయ విస్తరణాధికారులు శ్రీలత, కావేరి, రైతులు పాల్గొన్నారు.


నిజాంపేటలో పచ్చిరొట్టె పంపిణీ చేస్తున్న మండల వ్యవసాయ అధికారి

## గోడలపై అక్షరమాల


అక్షరాలను చదువుతున్న విద్యార్థులు

విద్యార్థులు అక్షరాలను మరిచిపోకూడదనే ఉద్దేశంతో వల్లభాపూర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పరమేశ్వర్‌రెడ్డి గ్రామంలోని కూడలి ప్రదేశాల్లో అక్షరాలను పెయింటింగ్ చేయించాడు. గ్రామంలోని కూడళ్లలో గోడలపై తెలుగు, ఇంగ్లీష్ వర్ణమాల, అంకెలు, గుణింతాలు, ఒత్తులను రాయించాడు. వేసవి సెలవుల్లో విద్యార్థులు ఆటలతో పాటు అప్పుడప్పుడు గోడలపై అక్షరాలను చదువుకుంటూ మరిచిపోకుండా ఉంటారనే ఉద్దేశంతో అక్షరాల పెయింటింగ్ చేయించినట్లు ఆయన తెలిపారు. – చేగుంట(తూప్రాన్)

## గ్యాస్ డబ్బులు రావడంలేదు

**మాజీ ఎంపీటీసీ ఆవేదన**

కౌడిపల్లి(నర్సాపూర్): గ్యాస్ డబ్బులు రూ. 500 రావడంలేదని మహ్మద్‌నగర్ మాజీ ఎంపీటీసీ మంతూరి కిష్టాగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కౌడిపల్లి ఎంపీడీఓ కార్యాలయం వద్ద కౌంటర్‌లో ప్రజాపాలన దరఖాస్తు చెక్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రజాపాలనలో ఆరుగ్యారంటీలకు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, గ్యాస్ కస్టమర్ నంబర్, కరెంట్ మీటర్ నంబర్‌తో దరఖాస్తు చేసుకున్నామని చెప్పారు. సబ్సిడీ గ్యాస్ తమకు వర్తించడం లేదన్నారు. ఎంపీడీఓ కార్యాలయం ప్రత్యేక కౌంటర్‌లో చెక్‌చేస్తే గ్యాస్ కస్టమర్ నంబర్ సరిగా ఉందని చెప్పారని తెలిపారు. గ్యాస్ పంపిణీ దారులను అడిగితే బ్యాంక్‌లో అడగమన్నారు. బ్యాంక్ అధికారులను అడిగితే మండలంలో అడగమన్నారు. ఇక్కడ అడిగితే సరిగా ఉందంటున్నారు. కానీ డబ్బులు మాత్రం రావడం లేదన్నారు. మండల కార్యాలయానికి రోజూ చాలా మంది గ్యాస్, ఉచిత కరెంట్ అమలు కావడంలేదని వస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి.. సమస్య తీర్చాలని కోరాడు.


మండల కార్యాలయం వద్ద ప్రజాపాలన దరఖాస్తు చూపుతున్న మాజీ ఎంపీటీసీ కిష్టాగౌడ్

## సంక్షిప్త వార్తలు

### ◆ పాపన్నపేటలో ఉచిత వైద్యశిబిరం



పాపన్నపేట(మెదక్): మండల కేంద్రం పాపన్నపేటలో బుధవారం వెంకటేశ్వర ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఐవీఎఫ్ ఆక్సిన్ ఫెర్టిలిటి కేంద్రం వారి ఆధ్వర్యంలో డాక్టర్ రామ్ లక్ష్మీనారాయణ, ఆముదల్ల శృతి ఆధ్వర్యంలో సంతాన లేమితో బాధపడుతున్న 60 మందికి పరీక్షలు నిర్వహించారు. ఉచిత మందులు పంపిణీ చేశారు. పాపన్నపేట, టేక్మాల్ మండలాల నుంచి పేషంట్లు వచ్చి వైద్య సేవలు పొందారు. వారికి ఆస్పత్రి సిబ్బంది నవీన్, వెంకట్, రవి, విఠలేశ్వర్ తగిన సౌకర్యాలు కల్పించారు.

### ◆ నల్లపోచమ్మకు పూజలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మను బుధవారం డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దయతో అందరూ బాగుండాలని కోరుకున్నట్లు ఆంజనేయులుగౌడ్ చెప్పారు.

### ◆ రెడ్డిపల్లి బ్రాంచ్ పోస్ట్‌మెన్‌పై ఫిర్యాదు



నర్సాపూర్ రూరల్: మండలంలోని రెడ్డిపల్లి బ్రాంచ్ పోస్ట్ మెన్ అజయ్ సక్రమంగా విధులు నిర్వహించడం లేదని బుధవారం రెడ్డిపల్లి గ్రామస్తులు నర్సాపూర్‌లోని సబ్ పోస్ట్ ఆఫీసులో ఫిర్యాదు చేశారు. ఉపాధి హామీ కూలీల డబ్బులతో పాటు పెన్షన్లు, ఉత్తరాల పంపిణీ సక్రమంగా ఇవ్వడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై ప్రశ్నిస్తే మీ ఇష్టం వచ్చిన చోట ఫిర్యాదు చేసుకోమని దురుసుగా సమాధానం చెపుతున్నట్లు గ్రామస్తులు గుడ్డి సత్యనారాయణ, ఎర్ల శేఖర్, నక్క సహదేవ్ తదితరులు తెలిపారు. ఈ విషయమై నర్సాపూర్ ఎస్‌పీఎం హరీష్‌ను వివరణ కోరగా.. రెడ్డిపల్లి పోస్ట్ మెన్ అజయ్‌పై ఫిర్యాదు వచ్చిన మాట వాస్తవమే అన్నారు. ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

### ◆ గెలుపోటములు సహజం



వెల్దుర్తి(తూప్రాన్): క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడినవారు దానిని స్ఫూర్తిగా తీసుకొని గెలుపొందడానికి ప్రయత్నించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మండలంలోని కుకునూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకలకు ఆయన హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో నియోజకవర్గంలోని 28 జట్లు పాల్గొనగా మొదటి బహుమతి తూప్రాన్, రెండవ బహుమతి కొట్టాల యువకులు గెలుపొందారు. విజేతలకు రాజిరెడ్డి మెడల్స్‌తో పాటు షీల్డ్‌లు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశం, నరేందర్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, హన్మేష, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.